# కొడిగట్టిన దీపం

కోశూరి వాణీచలపతిరావు

**అయిదు** గంటలు కొట్టింది గోడ గడియారం.

అంతవరకూ ఫైల్స్‌లో తల దూర్చి, హైస్కూలు కుర్రాడిలా శ్రద్ధగా హోం వర్క్ చేసుకుంటున్న గోపాలం సాలోచనగా గేటువంక చూశాడు.

ఆయన మనసులో ఏదో సందేహం, కొద్ది ఆత్రుత తొంగిచూశాయి.

కానీ అంతలోనే ఏదో సర్దుబాటుతో మనసుని సముదాయించుకొన్నట్లుగా మళ్ళ ఫైళ్ళలో తల దూర్చేశాడు. అయినా మధ్య మధ్య తలెత్తి గేటు వంక చూడకుండా మాత్రం ఉండలేకపోతున్నాడు.

వంటింట్లో సరోజ పరిస్థితీ అలాగే ఉంది. కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా అటూ ఇటూ తిరుగు తున్నది. ఏ పనిమీదా మనసు లగ్నం కావటం లేదు.

బైటి వరండాలోకి వస్తే భర్త తన ఆత్రుతని, భయాన్ని ఎక్కడ కనిపెడతాడో అని ఇంట్లో ఇంట్లోనే తిరుగుతున్నది.

భార్యాభర్తలిద్దరిలో ఒకే రకం భయం, ఒకే రకం ఆత్రుత, ఆరాటం చోటుచేసుకున్నా—వాళ్ళు మాత్రం ఎవరికి వారే తమలోనే అలాంటి భావా లున్నట్లు, ఇంకొకరిని అలాంటి భయాందోళనలకు గురిచేయకూడ దన్నట్లు పైకి నిశ్శబ్దంగా ఉన్నారు.

ఈ సారి టంగ్ టంగ్‌న ఆరుగంటలు కొట్టింది గోడ గడియారం. ఒక్కొక్క గంటా సుత్తిపోటులా తన హృదయంపై మ్రోగుతుంటే తల్లడిల్లి పోయింది సరోజ.

మనసులో ప్రవేశించిన భయం పెద్ద భూతంలా భయపెడుతుంటే ఇక భరించలేనట్లుగా గబగబా వరండాలోకి వచ్చింది.

అదే సమయంలో ఆత్రుతగా భార్య ముఖం వంక చూశాడు గోపాలం.

''ఏమండీ! ఆరయింది! అమ్మాయి ఇంకా స్కూలు నుంచి రాలేదు!''

''నేనూ అదే ఆలోచిస్తున్నాను! ఇలా లేటుగా రావటం ఎప్పుడయినా ఉందా?''

''రోజూ నాలుగు గంటలకల్లా వచ్చేస్తుందండీ! పరీక్షల రోజులు కదా ఏ ప్రయివేట్ క్లాసో తీసుకొని ఉంటార్లే అని ఇందాకట్నుంచీ జాప్యం చేశాను కానీ ... ఆరయినా రాకపోవటం ... నా కేదో భయంగా ఉందండీ!'' వణికే కంఠంతో అంది సరోజ.

''స్నేహితుల ఇంటి కేమయినా వెళ్ళిందేమో!'' సాలోచనగా అన్నాడు గోపాలం.

''అలా వెళ్ళే పిల్లగాదండీ అది. ఇంట్లో మనం ఖంగారుపడుతూ ఉంటామని తెలుసు. ఎక్కడికి వెళ్ళదల్చుకున్నా ఇంటికి వచ్చాకే వెళ్తుంది.''

''అయితే ఏం జరిగి ఉంటుం దంటావ్?'' తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో అన్నాడు గోపాలం.

వీళ్ళలా తర్జనభర్జనలో ఉండగానే కాలం మరో అరగంట ముందుకు పరుగెత్తింది.

''ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి? ఆరున్నరకూడా అయింది. ముందు స్కూలు కెళ్ళి అక్కడ ఉందేమో చూడండి. అక్కడ లేకుంటే వస్తూ వస్తూ గీత వాళ్ళింటికి వెళ్ళండి. ఒకవేళ వెళితే వాళ్ళింటికే వెళ్తుంది.'' తరుముతున్నంత వేగంగా భర్తను బయటికి పంపించింది సరోజ.

వంకీ నున్న చొక్కా తగిలించుకొని, చెప్పులేసుకొని గేట్లో నుండి బయటి కెళుతున్న గోపాలం నడకలో ఆత్రుతతో కూడిన వేగం కనిపించింది.

భర్త వెళ్ళిన వంకే చూస్తూ, ఆయన కనుమరుగు కాగానే అక్కడే మెట్ల మీద చతికిలబడింది సరోజ.

ఇంట్లోకి వెళ్ళటానికి కాళ్ళు రాక, ఏ పని మీదా మనసు నిలవక ఆమె పరిస్థితి విచిత్రంగా తయారయింది.

పిచ్చి పిచ్చి ఆలోచనలతో, ఏదీ సరిగా తెలియని అయోమయావస్థతో మనసంతా మహారణ్యంలా గజిబిజిగా తయారయింది.

''ఏమిటి సరోజా! మీ ఇంట్లో అంతా ఏదో కంగారుపడుతున్న ట్లున్నారు. ఏం జరిగింది?'' అవతలి వాటాలో నుండి ఇవతలికి తొంగిచూస్తూ దీర్ఘం తీసింది పక్కింటి పంకజం.

సరోజకు పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్లయింది.

''అబ్బే! ఏం లేదు ...'' అంటూ ఏదో సర్ది చెప్పబోయేంతలోనే ఎదురింటి సుభద్ర తలచిక్కు తీసుకుంటూ కిటికీలోనుండి తొంగి చూసింది.

''సరోజా! మీ దీప కనబడదేం! ఇంకా స్కూలు నుంచి రాలే?'' అంది ఆరాతీస్తూ.

దొంగను పట్టేసిన పోలీసు అధికారిలా ఉంది ఆ సమయంలో ఆమె పోజు.

తను అడగాలనుకుంటున్న దాన్ని, మధ్యలో సుభద్ర అందుకొని అడగటంతో ఉక్రోషం వచ్చింది పంకజానికి.

ఇలాంటి విషయాలలో సుభద్రకన్నా పంకజానికే ఆసక్తి ఎక్కువ. ఆమెవి డేగకళ్ళు! ఇంట్లో తనపని తాను చేసుకుంటూనే ఎందుకయినా మంచిదని ఒక కన్ను, ఒక చెవి ఇరుగు పొరుగు ఇళ్ళ మీద వేసి ఉంచుతుంది.

''ఇంట్లో ఈడేరిన పిల్లలుంటే తలిదండ్రులకు గుండెల మీద కుంపటున్నట్లే అనుకో, సుభద్రా! ఒంటరిగా బయటికి వెళ్ళిందంటే మళ్ళీ ఇంటికి వచ్చిందాకా భయంగానే ఉంటుంది. అసలే మాయదారి కాలం ... మాయదారి బుద్ధులు అని! కాలం తగలబడిపోతోంది! ఇందాకటి నుండి పాపం మన సరోజ, గోపాలం ఒకటే కంగారుపడిపోతున్నారు.'' పరామర్శ పేరుతో మరి కొంత మంటను సరోజ హృదయంలో రగిల్చింది పంకజం.

తనను మాట్లాడనీయకుండా వాళ్ళిద్దరే అలా మాట్లాడుకోవటం, వ్యాఖ్యానాలు చేయటం చిరాకనిపించింది సరోజకు.

''మేమేమీ కంగారు పడటం లేదండీ! ఈ రోజు ప్రయివేట్ క్లాసు ఉంది, లేటుగా వస్తానని ... ఉదయం-మా అమ్మాయి చెప్పివెళ్ళింది.'' విసురుగా సమాధానం చెప్పి, అంతలోనే గతుక్కుమంది సరోజ.

పాలిపోయిన ముఖంతో ఒంటరిగా లోపలికి వస్తున్న భర్త కనిపించాడు.

పంకజం, సుభద్ర ...ఇద్దరూ ఆసక్తిగా కొంచెం ముందుకు వంగి చెవులు రిక్కించారు.

అది గమనించిన సరోజ భర్త తొందరలో అక్కడే ఏమయినా చెబుతా డేమో అనే భయంతో చరచరా లోపలికి వెళ్ళింది.

భార్య ఆంతర్యం తెలుసుకున్న గోపాలం ఆమె వెంటే తనూ లోపలికి వెళ్ళి, వీధి తలుపు వేశాడు.

నిరాశగా నిట్టూర్చింది సుభద్ర.

కసికసిగా ఆ తలుపుల వంక చూసి పరుగులాంటి నడకతో మధ్య హాల్లోకి వెళ్ళింది పంకజం.

''స్కూల్లో ఎవ్వరూ లేరు! గేటుకు తాళం పెట్టి ఉంది. గీతవాళ్ళింటి కెళితే నాలుగింటికే దీప స్కూలునుండి బయలుదేరిందని చెప్పింది.'' కంగారుగా భార్య ముఖం లోకి చూస్తూ అన్నాడు గోపాలం.

సరోజకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. ఉద్వేగంతో గుండె దడదడలాడింది, కాళ్ళు చేతులు గజగజా వణికాయి.

దుఃఖంతో పూడుకుపోయిన గొంతులోనుండి మాట పెగిలి బయటకు రాలేదు.

''ఇప్పుడెలాగండీ! అమ్మాయి ఏమయిపోయింది!'' అనగలిగింది అతి కష్టం మీద.

''నాకూ అదే తోచటం లేదు. అప్పట్లు నగ లేమయినా పెట్టుకొని వెళ్ళిందా?'' ఆత్రుతగా అడిగాడు గోపాలం.

''చెవులకు రింగులు తప్ప పెద్ద ఖరీదయిన




సగలేమీ లేవండీ.''

''అలాగా! మరి ఏం జరిగి ఉంటుంది? ఈ మహా పట్టణంలో ఎక్కడని వెతకడం!''

''అదేమిటండీ అలా అంటారు? త్వరగా ఏదో మార్గం ఆలోచించండి!'' క్షణక్షణానికీ తనలో పెరిగిపోతున్న భయాందోళనలను వ్యక్తం చేస్తూ అంది సరోజ. అప్పటికే ఆమె కళ్ళ నుండి వర్షిస్తున్న కన్నీటి జాలు బుగ్గల మీదుగా ప్రవహించింది.

భార్యవంక జాలిగా, సానుభూతిగా చూశాడు గోపాలం.

''ఒకేటే మార్గముంది, సరోజా!'' అన్నాడు చివరకు.

''ఏమిటది?''

''పోలీసు రిపోర్ట్ ఇవ్వటం?''

అదిరిపడింది సరోజ.

''పోలీసురిపోర్టా ... అమ్మో! వద్దండీ. వాళ్ళు వచ్చి పెద్ద రాద్ధాంతం చేస్తారు. అందరికీ తెలిసి పోతుంది. పేపర్లో ఈ వార్తను ప్రకటించి, ఫోటో వేసి దాన్ని రచ్చకీడుస్తారు. ఆడపిల్ల జీవితానికి ఇదో మచ్చలా ఏర్పడిపోతుంది. మన పరువూ ప్రతిష్టా—''

''పరువూ, ప్రతిష్టా అంటూ మనం ఆలోచిస్తూ కూర్చుంటే దాని ప్రాణాలకే ముప్పు రావచ్చు సరోజా! ఆ తరవాత ఎంత చింతించినా లాభం ఉండదు.'' అనగూడని విషయమైనా అనక తప్పదన్నట్లుగా అన్నాడు గోపాలం.

ఒక్కసారిగా బావురుమంది సరోజ. భర్త హృదయంపై వాలి వెక్కి వెక్కి ఏడ్చింది.

''అంతమాట అనకండి. నేను భరించలేను. నా చిట్టితల్లి ఎక్కడున్నా క్షేమంగా ఉంటుందని చెప్పండి! ఒక్కగా నొక్కపిల్ల... ఎంతో గారాబంగా... పెంచాను. దానికే మయినా అయితే నేను బతక లేనండీ. అది నా ప్రాణం.''

సరోజ కన్నీళ్ళతో గోపాలం షర్టు తడిసిపోయింది. ఓదార్పుగా భార్య వీపును రాస్తూ వచ్చే కన్నీటిని దిగమింగుకున్నాడు గోపాలం.

తను ధైర్యంగా ఉండకపోతే . . . సరోజ మరీ బెంబేలు పడుతుందని అతనికి తెలుసు.

''నే నిప్పుడే వస్తాను, నువ్వు ధైర్యంగా ఉండు. మన దీప క్షేమంగా ఇంటికి తిరిగి వస్తుంది'' అని భార్యను మెల్లగా విడిపించుకుని బయటికెళ్ళి పోయాడు గోపాలం.

మనసులోనే వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటూ అక్కడే అలాగే నిల్చుండి పోయింది సరోజ. అప్పుడే వచ్చి మళ్ళీ అంతలోనే బయటికెళుతున్న గోపాలాన్ని రెండు జతల కళ్ళు ఆసక్తిగా చూశాయి.

మానవ మనస్తత్వం చాలా విచిత్రమైంది. ప్రగతి పథంలో మానవుడు ఎన్నో ఘన విజయాలను సాధించినా... తన మనస్సును— ఆ మనస్సులోని బల హీనతలను మాత్రం జయించలేక పోతున్నాడు.

మనిషి మనస్తత్వాన్ని క్షుణ్ణంగా పరిశీలించి యథాతథంగా, నిర్మొహమాటంగా ఎవరైనా వాటిని బయటపెట్ట గలిగినవాడు, తన వింత మనస్తత్వాన్ని మూసుకొని ఆ మనిషే సిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది.

యాంత్రిక జీవితాన్ని రోజూ అనుభవించి

అనుభవించి విసుగెత్తిన మనిషి మంచి ఆసక్తిని గలిగించే సంఘటనలను, వార్తలను కాంక్షిస్తూ ఉంటాడు. తను చూసిన, లేక విన్న వింతను నలుగురికీ చెప్పి వాళ్ళు బోలెడు ఆశ్చర్యాన్ని, ఆసక్తిని వ్యక్తం చేస్తుంటే పెద్ద ఘన కార్యం చేసినట్లు పోజుకొట్టడం మనిషినైజం.

పొరుగింట్లో దొంగలు పడ్డారన్నా, ఎదురింటాయన పెళ్ళాం ఎవరితోనో లేచి పోయిందన్నా ఇరుగింటాయనకు పరమ సంతోషం! (అదే సంఘటన తన ఇంట్లో మాత్రం జరక్కూడదు) ఆ సమయంలో అతను వ్యక్తపరచే సానుభూతి వాక్యాలు, కన్నీళ్ళు అంతా నటన. అవి హృదయపు లోతుల్లో నుండి వచ్చినవి కావు!

ఒకరి కష్టాన్ని చూసి నిజంగా బాధపడ గలిగేది అతని అత్యంత ఆప్తులు... మిత్రులు అయిన ఏ కొద్దిమందో మాత్రమే!

స్కూలుకు వెళ్ళిన దీప ఆ రాత్రంతా కూడా ఇంటికి రాలేదన్న వార్త పంకజం, సుభద్రల పుణ్యమా అని ఆ నోటా, ఈ నోటాపడి ఆ కాంపౌండ్ లోని అందరి ఇళ్ళకూ ఇట్టే వ్యాపించిపోయింది.

ఆరు పోర్షన్లున్న పెద్ద బంగళా అది! ఎవరింట్లో ఏం జరిగినా ఇట్టే అందరికీ తెలిసిపోతుంది. ఆ ఇంటి గోడలకు కిటికీలు, తలుపులు సరిగా ఉన్నా లేకపోయినా కిటికీలంత కళ్ళు, తలుపులంత చెవులు మాత్రం ఉన్నాయి.

వాటి ద్వారా జరిగింది జరిగినట్లు, విన్నది విన్నట్లు ప్రచారం చేసి ఆ తరవాత క్యూలో పరామర్శకు బయల్దేరి బోలెడు సానుభూతి ఖర్చు చేసి వాళ్ళను విసిగించి గానీ ఇంటికి రారు.

వెళ్ళక పోతే బాగుండదని మాత్రమే ఆలోచించగలరు గానీ, వెళ్ళి వాళ్ళను ఇంకా అవమానిస్తున్నాం అన్న ధ్యాస వాళ్ళకుండదు.

ఏడ్చి ఏడ్చి పత్తికాయల్లా ముడుచుకొని పోయిన కళ్ళను ఇంకా వత్తుకుంటూంది సరోజ.

గోపాలం—ఇంటికీ, పోలీసుస్టేషన్‌కు విసుగు లేకుండా తిరుగుతున్నాడు.

చూస్తూ చూస్తూ ఉండగానే అప్పుడే ఆరు రోజులు గడిచిపోయాయి.

రేడియోలో, టి. వి. లో ప్రకటనలు ఇప్పించారు. అయినా లాభం లేక పోయింది. దీప అసలు ప్రాణాలతో ఉందో, లేదో అన్నది ఆ తల్లిదండ్రులను వేధిస్తున్న సమస్య.

రోజూ బంధువు లెంతో మంది వచ్చి సానుభూతి మాటలు చెప్పి వెళుతున్నారు.

వచ్చిపోయే జనంతో, ఇరుగుపొరుగుల వ్యాఖ్యానాలతో చెప్పలేనంత విసుగ్గా ఉంది సరోజా, గోపాలంలకు!

ఒక్క రోజయితే ఎలాగో రహస్యం దాచి పెట్టవచ్చు. ఇన్ని రోజుల తరవాత, ఇంత ప్రచారంజరిగాక గుట్టురట్టు కాకుండా ఎలా ఉంటుంది?

ఎవ రింట్లో చూసిన ఇదే చర్చనీయాంశం అయింది. ఆరు రోజుల నుండీ అందరికీ మంచి కాలక్షేపంగా ఉంది. ఎవరికి తోచిన రీతిలో వారు వ్యాఖ్యలు చేస్తున్నారు.

"పంకజం! సరోజ కూతురు, ఇన్ని రోజులయినా ఇంటికి రాకపోవటం ఏమిటె? ఎక్కడికి వెళ్ళుంటుందంటావ్?" ఎదురింటి సుభద్ర సందేహం అది.

"ఆడపిల్ల ఇల్లొదిలి బయటికెళ్ళిందంటే... ఏమిటె అర్థం! మాయదారి కాలం. మాయదారి బుద్ధులు అవి. ఎవడితోనో లేచి పోయుంటుంది!" ఏ మాత్రం సంకోచం లేకుండా, కుండబద్దలయినట్లు అంది పంకజం.

"అయ్యో రామా! ఇదెక్కడి అన్యాయం— ఆ పిల్ల ఎంత పిల్లనీ! ఇంకా పెద్దమనిషి కూడా కాలేదు! పసిపిల్ల అది ఇంత పని చేసిందంటే నేను నమ్మను."

"నీకేం తెలుసు! నువ్వు మరీ సత్తెకాలం మనిషివి! మాయదారి కాలం. మాయదారి బుద్ధులూ అని. కాలం ఎలా తగలడిందో చూస్తున్నావా మరి! ప్రేమలు, దోమలు—ఇవన్నీ ఇదివరకు కాలేజీలోనే ఉండేవట! ఇప్పుడు హైస్కూళ్ళ నుంచి మిడిల్ స్కూళ్ళవరకు పాకిపోయాయట! ముందు ముందు ప్రైమరీ స్కూళ్ళకు కూడా వస్తాయేమో ఖర్మ!" తలబాదుకుంది ఇద్దరు మగపిల్లల తల్లి పంకజం.

"అవును, పంకజం! అదీ నిజమే. కాలం అలా తగలబడింది మరి. రోజూ పొద్దున్నే పేపర్లో ఎంతెంతటి ఘోరాలు చదవటం లేదు? పాలుగారే పసిపిల్లలనే మానభంగాలు చేస్తున్నారు. రాను రాను




ఇంట్లోను మరియూ ఆఫీసులోను, షాపులలోను మరి ఎక్కడైన సరే.

వాడండి

లినోలియం

పలు విధాలుగా నేలపై పరచ దగ్గది

★ పరిచేందుకు, వాడేందుకు సులువైనది
★ ఆదానిచ్చేది—మన్నికైనది
★ పరిశుభ్రమైనది మరియు చప్పుళ్ళను తనలో యిముడ్చుకో గలది.
★ ఆకర్షణీయమైన రంగులలోను మరియు డిజైన్లలో లభిస్తున్నాయి.

ఇండియా లినోలియమ్స్ లిమిటెడ్
9/1, ఆర్. ఎన్. ముఖర్జీ రోడ్.
కలకత్తా-700001

CC/IL-2/82 T

కలియుగం మరీ పాపాల పుట్టగా తయారవుతున్నది.'' అంది సుభద్ర—తన మనసులోని అక్కసునంతా బయటపెడుతూ.

''అవునవును! బ్రహ్మంగారు ఇవన్నీ చెప్పనే చెప్పారు!'' అంది పంకజం స్నేహితురాలి మాటలకు వంతపాడుతూ.

గోడ అవతలి సంభాషణ విన్న సరోజ హృదయం వేయి ముక్కలయింది. పంకజం, సుభద్రలమీద చెప్పరానంత కోపం వచ్చింది. ఇప్పుడే వచ్చి సానుభూతి చూపించివెళ్ళారు. ఇంతలోనే ఎంత సకిరంగా మాట్లాడుతున్నారు? తన చిట్టితల్లి ఎవరితోనో లేచిపోయిందా? ఛ!ఛ! వాళ్ళు బిడ్డలను గన్న తల్లులే. అభం శుభం తెలియని పిల్ల మీద నింద వేయటానికి నోరెలా వచ్చింది? కసిగా అనుకుంది సరోజ.

ఇంతలో బయట ఏదో జీపు వచ్చి ఆగిన శబ్దమయింది.

''సరోజా!...సరోజా! మన దీప వచ్చింది!'' గావు కేక పెట్టాడు గోపాలం.

ఒక్క పరుగున ఒక్క అంగలో బయటపడింది సరోజ.

ఎదురుగా గుమ్మం ముందు పోలీసువాను ఆగి ఉంది. అందులోంచి దిగుతున్న దీపను చూడగానే ప్రాణం లేచివచ్చినట్లయింది సరోజకు.

తల్లిని చూసి దీప పరిస్థితీ అలాగే ఉంది.

''అమ్మా!'' అంటూ తల్లిని చుట్టేసి బావురుమంది దీప.

ఆ పిలుపుకు, ఆ స్పర్శకు నిలువెల్లా పులకించి పోయింది ఆ తల్లి హృదయం.

కూతురి ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ—

''నా చిట్టితల్లీ! నా కన్నా! ఇన్నాళ్ళు ఎక్కడికి పోయావే? నిన్ను చూడకుండా ఈ అమ్మ ఎలా బతగ్గలదనుకున్నావే!'' అంటూ ముఖమంతా ముద్దులతో ముంచెత్తింది సరోజ.

''అమ్మా! దీపూ! ఎక్కడి కెళ్ళావమ్మా!'' అన్నాడు గోపాలం గద్గద స్వరంతో.

''నాన్నా!'' అంటూ తండ్రి హృదయంపై వాలిపోయింది దీప,

''నేను వెళ్ళలేదు, నాన్నా! వాళ్ళు... వాళ్ళు నన్నెత్తుకెళ్ళారు.''

సరోజా, గోపాలం ఇద్దరూ ఒకేసారి ఉలిక్కిపడ్డారు.

''ఎవరమ్మా! ఎవరు ఎత్తుకెళ్ళారు?'' ఇంగా రుగా అంది సరోజ.

''నేను స్కూలు నుంచి వస్తుంటే రామాలయం సందు దగ్గర ఒక కారు వచ్చి నా పక్కగా ఆగిందమ్మా! అందులో నలుగురు మనుషు లున్నారు. కారుకు దారి ఇవ్వాలని పక్కకు జరిగాను. వాళ్ళు నా ముందే కారు ఆపి అమాంతం నన్ను కారులోకి గుంజారు. ముక్కు దగ్గర కర్చీఫ్ అదిమిపెట్టారు. ఆ తరవాత...తరవాత నాకేమీ తెలియలేదు. తెలివి వచ్చాక...'' భయంతో కళ్ళు మూసుకుంటూ ఆగిపోయింది.

అంతవరకూ అక్కడే నిల్చుని ఆ తల్లిదండ్రుల సంతోషాన్నీ, ఆ పసిహృదయంలో ఆరని వేదనని తమకంగా చూస్తున్న పోలీస్ సబ్ ఇనస్పెక్టర్ ఈసారి కలుగజేసుకున్నాడు.

''గోపాలంగారూ! మీ అమ్మాయిని నలుగురు రవుడీలు ఎత్తుకెళ్ళి బొంబేలో ఒక బ్రోతల్‌హౌస్‌కి అమ్మేశారు. రెండు రోజులు స్పృహ లేకుండా పడిపోయింది. మూడోరోజు తెలివచ్చి చూసి తనో గదిలో బంధించబడ్డానని తెలుసుకుంది. ఆ తరవాత ఏం చేసిందో తెలుసా! నిజంగా మీ అమ్మాయి చాలా తెలివిగా ప్రవర్తించిందండీ! భయంతో ఏడుస్తూ కూర్చోకుండా ధైర్యంగా తను ఎలా బయటపడాలా అని ఆలోచించింది. ఆ గదిలో ఒక ఉల్లిపాయల బస్తా కనిపించిందట. తన జాడను బయటివాళ్ళకు తెలపాలని వెంటిలేటర్ కినుండి ఒక్కొక్క ఉల్లిగడ్డనే విసిరేసింది. ఆకాశం నుండి ఉల్లిపాయల వర్షం కురుస్తుందా అన్నట్లుగా రోడ్డంతా ఎక్కడ చూసినా ఉల్లిపాయలు చిందర వందరగా పడి, ట్రాఫిక్ బందయిపోయింది.


ఇదేదో ఉపద్రవంలాగుందని భావించిన జనం ఇక ఆసక్తిగా ఉల్లిపాయలొస్తున్న దిక్కుకుచూడటం మానేసి పోలీసులకు ఈ వార్త చేరేశారు. వాళ్ళు ఆఘమేఘాల మీద అక్కడికి వెళ్ళి ఉపాయంతో మీ అమ్మాయిని, ఆమెతో పాటు ఇంకా ముప్పయి మంది అమ్మాయిలను ఆ నరక కూపంనుండి బయట పడేశారు. తనను తాను రక్షించుకోవడమే గాకుండా ఇంతమంది జీవితాలను కాపాడిన మీ అమ్మాయి నిజంగా అభినందనీయురాలు!'' అన్నాడు పోలీసాఫీసరు—దీప వంక మెచ్చుకోలుగా చూస్తూ.

కూతురి వంక గర్వంగా చూశాడు గోపాలం.

''నా తల్లీ! ఎంతగండం తప్పిందే?ఆ దుర్మార్గులు నిన్నుఏమయినా చేసుంటే ఇంకేముంది నా ఉందా! మనమంతా అదృష్టవంతులం! ఆ దేవుడే చల్లగా కాపాడాడు! నా పూజలు వూరికే పోలేదు!'' అంది సరోజ దీపను హృదయానికి హత్తుకుంటూ.

గోపాలం పోలీస్ ఇనస్పెక్టరుతో కరచాలనంచేసి, థాంక్స్ చెప్పి వాళ్ళను మర్యాదగా సాగనంపాడు. తన కూతుర్ని పువ్వుల్లో పెట్టి తన కందించిన పోలీసుల మీద అపరిమితమైన గౌరవం కలిగింది అతనిలో.

అంతవరకూ అక్కడే గుమ్మంలో నిల్చొని డ్రామాలా అక్కడి సన్నివేశాన్ని చూస్తున్న పంకజం, సుభద్ర వగైరా వగైరాలంతా పోలీసులు వెళ్ళిపోవటంతో సందడి తగ్గటం వల్ల ఎవరి వాటాలోకి వారు చల్లగా జారుకున్నారు.




ఇంట్లోకి వెళ్ళగానే ఉప్పు, మిరపకాయలతో దీపకు దిష్టి తీసింది సరోజ.

దీప క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చినందుకు సరోజ, గోపాలంలకు చాలా సంతోషంగా, తృప్తిగా ఉంది. అసంతృప్తితో బాధ పడిందల్లా ఇరుగు పొరుగు అమ్మలక్కలే.

''ఈ సరోజ కసలు బుద్ధి లేదు! బిడ్డ తిరిగి వచ్చిందని సంతోష పడటమే గానీ, ఆ పిల్ల శీలం పవిత్రంగా ఉందో, లేదో తెలుసుకోదేం?''

''ఏమీ జరగలేదన్నట్లే అనుకుంటున్నారుగా!''

''అలా అనుకోకపోతే ఇంకెలా అనుకుంటారు? అయినా రెండు రోజులు స్పృహ లేదంటున్నారు. ఆ ఒళ్ళు తెలియని స్థితిలో ఎవడేం చేశాడో ఆ పిల్లకు మాత్రం ఎలా తెలుస్తుంది! ఒంటరిగా ఆడపిల్ల దొరికితే ఆ నలుగురు రవుడీ వెధవలు ఏమీ చెయ్యకుండా వదిలి పెట్టారంటే ఎలా నమ్మటం?''

''డాక్టర్ పరీక్ష చేయిస్తే తెలుస్తుందిగా!''

''ఆఁ! నీ పిచ్చి గానీ! అవన్నీ చేయించి ఎవరయినా గుట్టురట్టు చేసుకుంటారా? రేపు ఆ పిల్లకు పెళ్ళి కావద్దూ! ఏదయినా జరిగినా జరగనట్టే నోరుమూసుకుని కూర్చుంటారు!''

''అయినా ఆరురోజులు వేశ్యల కొంపలో ఉండి వచ్చిన పిల్లను ఇంకా పవిత్రంగా ఉందని నమ్మి పెళ్ళి చేసుకోవటానికి ఎవడు ముందుకొస్తాడు!''

ఇరుగు పొరుగు వ్యాఖ్యానాలు విసుర్లు అడపాదడపా సరోజ చెవిలో కూడా పడక మానలేదు. ఈ కుళ్ళుబోతు సమాజపు వోర్వలేని తనం చూస్తుంటే ఆ తల్లి కళ్ళముందు కూతురి భవిష్యత్తు భయంకరంగా నిల్చింది. దీప బాల్యంలో జరిగిన ఈ సంఘటన జీవితంపై ఏర్పడిన ఈ మచ్చ—దాని భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనని ఆందోళన పడింది సరోజ.

దీపంలా ఉజ్వలంగా వెలిగిపోతున్న దీప జీవితం ఈ సంఘటనతో కొడిగట్టిన దీపమయింది. మానవత్వమున్న ఏ మనిషి అయినా ముందు కొచ్చి ఆరిపోతున్న ఆ వత్తిని పైకి నెట్టి ఇంత చమురు పోస్తే మళ్ళీ వెలుగుతుంది దీపం. అప్పుడు ఆ దీపపు వెలుగులో చుట్టూ ఉన్న అజ్ఞానతిమిరం సైతం భయపడి పారిపోతుంది.

అలా జరగకుంటే తప్పు దీపనిది కాదు, వెలుగును చూడటం చేత గాని ఈ గుడ్డి సమాజానిది!

*